క్లుప్తంగా

ఆర్టీసీ బస్సు నడపాలి

నర్వ: ఎల్లంపల్లి, పెద్దకడ్మూర్, యాంకిల నుంచి మండల కేంద్రం నర్వ మీదుగా జిల్లా కేంద్రానికి బస్సును నడపాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు. నిత్యం వివిధ పనుల నిమిత్తం, మండల కేంద్రం, జిల్లా కేంద్రాలకు వెళ్లేందుకు బస్సులు ఈ మార్గం గుండా లేకపోవడంతో బైక్‌లు, ప్రైవేట్ వాహనాలే దిక్కయాయని వాపోతున్నారు. ఈ నేపథ్యంలో బస్సులను గద్వాల డిపో నుంచి నారాయణపేట వరకు, పేట నుంచి గద్వాల్ వరకు వయా నర్వ, జక్లేర్‌ల మీదుగా వెళ్లే ఆయా గ్రామాల ప్రజలకు సౌకర్య వంతంగా ఉంటుందన్నారు. ప్రస్తుతం యాంకి నుంచి జక్లేర్ వరకు డబుల్ రోడ్డు ఉన్న సరైన బస్సులు లేక ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. దీనిపై నారాయణపేట డిపో అధికారులు ఫీల్డ్‌సర్వే నిర్వహించి బస్సును ప్రారంభించి ప్రయాణ ఇబ్బందులను తొలగించాలని వారు కోరుతున్నారు.

తాగునీటికి ఇబ్బంది లేకుండా చర్యలు



మక్తల్: పట్టణంలోని సత్యసాయి మెయిన్‌పంపు హౌస్‌కు నీటిసరఫరా గ్రామాలకు సక్రమంగా అందకపోవడంతో తాగునీటి ఎద్దడి ఏర్పడింది. దీంతో పైప్‌లైన్ ద్వారా మెయిన్‌కాల్వ నుంచి మోటార్లకు నీరు అందకపోవడంతో ముందుజాగ్రత్త చర్యగా కృష్ణానదిలో జేసీబీ సాయంతో మట్టిని తిస్తున్నారు. గ్రామాల్లో నీటిసరఫరాను అందించేందుకు ముందస్తుగా చర్యలు తీసుకుంటున్నారు.

బాల్యవివాహాల నిర్మూలనపై అవగాహన



ఆత్మకూర్: బాల్య వివాహాల వల్ల ఎన్నో రకాల అనార్థాలు చోటుచేసుకుంటాయని, ఈ దురాచారాన్ని అరికట్టేందుకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని జిల్లా బాలల పరిరక్షణ విభాగం నిర్వాహకుడు నరేష్ అన్నారు. గురువారం స్థానిక బాలుర ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. చిన్నతనంలోనే వివాహం చేయడంతో బాలిక ఆరోగ్యం పూర్తిగా క్షీణించడంతో పాటు శిశువులు అనారోగ్యంగా పుడతారని, మరణాలు కూడా సంభవించే ప్రమాదం ఉందనా ఆందోళన వ్యక్తం చేశారు. అలాగే అమ్మాయిల గుడ్ టచ్, బ్యాడ్ టచ్, లైంగికదాడులు, వేధింపులపై వివరించారు. కార్యక్రమంలో నిర్వాహకుడు రవిరాజు, హెచ్‌ఎం మద్దిలేటి, విద్యార్థులు పాల్గొన్నారు.

బీసీలకు పెద్దపీట

పాలమూరు: బీసీ కమిషన్‌కు రాజ్యాధికార హోదా కల్పించిన ఘనత ప్రధాని మోదీకి దక్కుతుందని, క్యాబినెట్‌లో 27మంది బీసీ మంత్రులు ఉన్నారని బీజేపీ ఓబీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెన్న ఈశ్వరప్ప అన్నారు. జిల్లా కేంద్రంలోని కార్యాలయంలో గురువారం విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థులను గెలిపించుకోవాల్సిన అవసరం చాలా ఉందన్నారు. జిల్లా అధ్యక్షుడు ప్రవీణ్‌కుమార్, నారాయణ యాదవ్, శంకర్, రవికుమార్, తరుణ తదితరులు పాల్గొన్నారు.

ఆస్పత్రి కార్మికులకు వేతనాలు చెల్లించాలి

ఆత్మకూర్: ప్రభుత్వ కమ్యూనిటీ హెల్త్‌సెంటర్‌లో పనిచేస్తున్న కార్మికులకు వేతనాలు ఇవ్వకపోవడంతో పస్తులు ఉండాల్సిన పరిస్థితి దాపురించిందని తెలంగాణ మెడికల్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్, ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి సురేష్ అన్నారు. జీఓ 60 ప్రకారం వేతనాలు చెల్లించాలని గురువారం ఆత్మకూర్‌లోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్ వద్ద కార్మికులతో కలిసి నిరసన తెలిపడంతో పాటు వైద్యాధికారికి సమ్మె డిమాండ్ నోటీసు అందజేశారు. ఏడు నెలలుగా సంబంధిత కాంట్రాక్టర్ కార్మికులకు వేతనాలు ఇవ్వకుండా నిర్లక్ష్యం చేస్తున్నాడని మండిపడ్డారు. శానిటేషన్, పేషెంట్ కేర్, సెక్యూరిటీ, సూపర్‌వైజర్ కార్మికులకు జీఓ 60 ప్రకారం రూ.15,600 ఇవ్వాల్సి ఉండగా అందులో కోతలు పెడుతూ అక్రమాలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. సంబంధిత కాంట్రాక్టర్ వెంకటయ్య ఏజెన్సీ నిర్వాహకులు కోతలు పెట్టడంతో పాటు గతేడాది ఆగస్టు నుంచి ఐదు నెలలుగా వేతనాలు ఇవ్వడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఐఎన్‌టీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బోరింగ్ శ్రీనివాస్, కార్మికులు బాలరాజు, వెంకటేష్, తిరుపతమ్మ, లక్ష్మి, అరుణ్ తదితరులు పాల్గొన్నారు.



తాగునీటి కోసం పాట్లు



గుడేబల్లూర్‌లో తాగునీటికోసం ఇబ్బందులు పడుతున్న మహిళలు

- వట్టిపోయిన వాగులు, చెరువులు
- సకాలంలో అందని మిషన్ భగీరథ నీరు
- ఇబ్బందులు పడుతున్న గ్రామాల ప్రజలు
- పట్టించుకుని అధికారులు, ప్రజాప్రతినిధులు



వ్యవసాయ పొలాల్లోని బోరుబావుల నుంచి గుడెబల్లూర్‌కు పైప్‌లైన్‌కోసం తవ్విన కాలువ

కృష్ణా: మండల కేంద్రంతోపాటు పలు గ్రామాల్లో తాగునీటి కష్టాలు వేసవి ప్రారంభానికే ముందే మొదలయ్యాయి. గుక్కెడు మంచినీటి కోసం జనం నానాపాట్లు పడుతున్నారు. వర్షాభావంతో భూగర్భజలాలు అడుగంటిపోవడంతో ఇంతకాలం గొంతు తడిపిన చేతిపంపులు సైతం వట్టిపోతున్నాయి. బావుల్లో నీరు ఆవిరైపోయింది. వేసవి ప్రారంభంలోనే పరిస్థితి తీవ్రంగా ఉంది. మండలంతోపాటు గుడేబల్లూర్, ముడుమాల్, మురహార్‌దొడ్డి, కుసుమర్తి, సూకూర్ లింగంపల్లి, ఆలంపల్లి ఆయా గ్రామాల ప్రజలు నీటి సమస్యను తీర్చాలని వాపోతున్నారు. కృష్ణాలో మొత్తం జనాభా 3 వేలు ఉండగా కేవలం 6 చేతి పంపులు మాత్రమే ఉన్నాయి. అందులో ఉప్పు నీళ్లు రావడంతో తాగునీటికి ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. గుడేబల్లూర్‌లో మొత్తం జనాభా 5,569 ఉండగా తాగునీటికి గాను 14 బోర్లు పనిచేస్తున్నాయి. ప్రతిరోజూ ఈ గ్రామానికి సరాసరి 5 లక్షల లీటర్ల నీరు అవసరం. కానీ, కేవలం 2 లక్షల లీటర్ల నీరు కూడా సరఫరా కావడం లేదు. ఇక ఆ గ్రామస్తులు పక్కనే ఉన్న వ్యవసాయ పొలాల్లో బోరుబావుల నుంచి తాగునీటిని తెచ్చుకుంటున్నారు.



అదేవిధంగా గత 5 సంవత్సరాల క్రితం గుడేబల్లూర్ గ్రామానికి కృష్ణానది నుంచి ప్రత్యేక పైప్‌లైన్ ఏర్పాటుకు గత ప్రభుత్వం రూ.58 లక్షలు మంజూరు చేసింది. వీటిలో ఒక్క రూపాయి కూడా ఖర్చుపెట్టకుండా ఆ నిధులను అలాగే వదిలేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి నీటి సమస్యను పరిష్కరించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

అస్తవ్యస్తంగా పైప్‌లైన్..

మండలంలోని పలు గ్రామాల్లో గతంలో వేసిన మిషన్ భగీరథ పైపులైన్ పూర్తిగా అస్తవ్యస్తంగా మారింది. ముఖ్యంగా నీటి ట్యాంక్ వరకు నీరు వస్తున్న ఇంటింటికీ మాత్రం నీరు చేరడం లేదు. అధికారులు స్పందించి ఇంటింటికీ నీరు చేరే విధంగా చూడాలని కోరుతున్నారు.

ఇబ్బందులు పడుతున్నాం..



మా కాలనీలో నీళ్ల కోసం ఇబ్బందులు పడుతున్నాం. మంచినీటి కోసం వ్యవసాయ బోరుబావుల వద్దకు వెళ్లి తీసుకొస్తున్నాం. అధికారులు స్పందించి నీటి సమస్యను తీర్చాలి.

– లక్ష్మి, గుడెబల్లూర్ గ్రామం

నీటి సమస్య తీర్చాలి..



అధికారులు స్పందించి నీటి సమస్యను తీర్చాలి. మిషన్ భగీరథ నీరు రాక ఇబ్బందులు మరింత పెరిగాయి. వేసవిని దృష్టిలో ఉంచుకుని నీటి సమస్యను పరిష్కరించాలి.

– అంజలి, గుడెబల్లూర్ గ్రామం

ట్యాంకర్ ద్వారా తాగునీటిని అందించాలి

నీటి సమస్య పరిష్కారానికిగాను ఈ వేసవి కాలం వరకు ప్రత్యేక నీటిట్యాంకర్ల ద్వారా తాగునీటిని అందించాలి. అలాగైన నీటి సమస్య తీరుతుంది. అదేవిధంగా గ్రామాల్లో చెడిపోయిన చెతిపంపులను బాగుచేయించాలి.

మహదేవ్, సర్పంచ్ కృష్ణ గ్రామం

నీటి సమస్య పరిష్కరిస్తాం..



మండలంలోని తాగునీటి సమస్యను పరిష్కరించడానికి ప్రత్యేకంగా కృషి చేస్తున్నాం. అయితే ప్రస్తుతం గ్రామంలో మంచి నీటి కోసం రూ. 5లక్షలు మంజూరయ్యాయి. కేవలం గ్రామాల్లో తాగునీటి సమస్య పరిష్కారానికి కేటాయించాం.

– ఎంపీడీఓ జానయ్య, కృష్ణా

సింగిల్ విండోలో వరి కొనుగోలు కేంద్రం

ధన్వాడ: వచ్చే సీజన్‌లో వరి కొనుగోలు కేంద్రాన్ని మండలంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘానికి కేటాయించడంపై అధ్యక్షుడు వెంకట్రామ్‌రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. గురువారం సింగిల్ విండో కార్యాలయంలో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ మేరకు.. ఆయన మాట్లాడుతూ.. ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం పరిధిలో ఉన్న గ్రామాల్లో కొనుగోళ్లను కేటాయిస్తే సంఘం అభివృద్ధి చెందుతుందని ఇందుకు అనుగుణంగా ఎమ్మెల్యే పర్ణికారెడ్డి స్పందించి కొనుగోలు కేంద్రాన్ని సింగిల్ విండోకు కేటాయించారన్నారు. దీంతో సింగిల్ విండోకు ఆదాయం సమకురడంతోపాటు రైతులకు అందుబాటులో ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు గండిబాల్‌రాజు, భాస్కర్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, భగ్యమ్మ, రూప్లానాయక్, సీఈఓ వెంకట్రాములు, ఎంపీటీసీలు గోవర్ధన్‌గౌడ్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అధ్యక్షుడు వెంకట్రాములు

రేపు బీజేపీ మండలస్థాయి సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

ఊట్కూరు: పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా ఈ నెల 30న మండలంలోని బీజేపీ మండల విస్తృత స్థాయి సమావేశం నిర్వహిస్తున్నట్లు బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి భాస్కర్ అన్నారు. గురువారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ.. ఈ సమావేశానికి ముఖ్యఅతిథులుగా పార్లమెంట్ బీజేపీ ఎంపీ అభ్యర్థి డీకే అరుణ, రాష్ట్ర నాయకులు జలంధర్ రెడ్డి, కొండయ్య, జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులు హాజరవుతున్నారని తెలిపారు. ఈ సమావేశంలో ఎన్నికల ప్రచారంపై చర్చించనున్నట్లు ఆయన తెలిపారు. ఈ సమావేశానికి బూత్ కమిటీ సభ్యులు, ప్రజాప్రతినిధులు, బీజేపీ కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు రమేష్, కృష్ణయ్యగౌడ్, హన్మంతు, లక్ష్మణ్, భరత్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా స్వపరిపాలన దినోత్సవం

ఊట్కూరు: మండలంలోని ఆయాగ్రామాల్లో అంగన్‌వాడీ కేంద్రాలలో గురువారం చిన్నారులు స్వపరిపాన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. పీడీ, పీఓ, సూర్‌వైజర్, టీచర్‌లుగా పలువురు విద్యార్థులు వ్యవహరించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ జ్యోతి, హర్షియాబేగం, బీమమ్మ తదితరులు పాల్గొన్నారు.



ఊట్కూరులో విద్యార్థులతో టీచర్లు

ఏఐసీసీ కార్యాలయం ఎదుట ధర్నా



ప్లకార్డులతో దళిత, ప్రజా సంఘాల నాయకులు

మహబూబ్‌నగర్ రూరల్: తెలంగాణ రాష్ట్రంలో జనాభా దామాషా ప్రకారంగా మాదిగలకు రెండు పార్లమెంట్ స్థానాలు కేటాయించాలని డిమాండ్ చేస్తూ దళిత, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో గురువారం న్యూ ఢిల్లీలోని ఏఐసీసీ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా మాదిగ జేఏసీ మహబూబ్‌నగర్ జిల్లా అధ్యక్షుడు బొర్ర సురేష్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో సుమారు 80 లక్షల మంది మాదిగలు ఉన్నారని, ఈ ప్రకారం కాంగ్రెస్ పార్టీ ప్రస్తుత పార్లమెంట్ ఎన్నికల్లో పోటీ చేసేందుకు మాదిగలకు రెండు స్థానాలు కేటాయించాలని డిమాండ్ చేశారు. మాజీ ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ డాక్టర్ పిడమర్తి రవికి కంటోన్మెంట్ పార్లమెంట్ స్థానాన్ని కేటాయించాలని కోరారు. మాదిగ జేఏసీ వనపర్తి జిల్లా కన్వీనర్ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ముస్లింల సంక్షేమానికి కృషి

స్టేషన్ మహబూబ్‌నగర్: ముస్లింల సంక్షేమానికి కాంగ్రెస్ కృషి చేస్తుందని ఎంపీ అభ్యర్థి చల్లా వంశీచంద్‌రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలో యునైటెడ్ ముస్లిం అడ్వయిజరీ ఫోరం ఆధ్వర్యంలో గురువారం ఇఫ్తార్ ఏర్పాటు చేయగా ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, రాష్ట్ర మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ఒబేదుల్లా కొత్వాల్ తదితరులు ముఖ్యఅతిథులుగా పాల్గొన్నారు. ముస్లింలకు ఖజూర్, పండ్లు తినిపించారు. షాసాబ్ గుట్ట దర్గా పీఠాధిపతి సయ్యద్ రజాక్‌షా ఖాద్రీ, ఫోరం కన్వీనర్ గులాం గౌస్, కోకన్వీనర్లు పాల్గొన్నారు.

అక్కడ అలా.. ఇక్కడ ఇలా..

- డివైడర్ నిర్మాణంలో రూ.46 లక్షలు వృథా

అమరచింత: స్థానిక మున్సిపాలిటీలో రోడ్ డివైడర్ల నిర్మాణాలకు ప్రభుత్వం నిధులను మంజూరు చేసింది. జనాభా ప్రతిపాదికన జిల్లాలో కొత్తగా ఏర్పడిన మున్సిపాలిటీలో మంజూరైన నిధులతో డివైడర్ల నిర్మాణాలు చేపట్టారు. అన్ని మున్సిపాలిటీల్లో రాతితో డివైడర్‌ను నిర్మిస్తే అమరచింతలో మాత్రం రూ.46 లక్షలు వెచ్చించి లైట్‌వెయిట్ ఇటుక పెల్లలతో నిర్మాణం పూర్తి చేశారు. నిర్మాణం జరిగి ఏడాది కాక ముందే వాహనాల తాకిడికే కూలిపోతున్నది. డివైడర్ రెండేళ్ల కాలానికే శిథిలావస్థకు చేరింది. అధికారులు స్పందించి సదరు కాంట్రాక్టర్, ఏఈలపై చర్యలు తీసుకోవాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

ఉపాధ్యాయుల సేవలు మరువలేనివి

మాగనూర్: ఉపాధ్యాయ సేవలు మరువలేనివని ఇన్‌చార్జి ఎంఈఓ వెంకటయ్య అన్నారు. గురువారం మండలంలోని ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం శివరాజు పదవీ విరమణ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు.. దాదాపు 33సంవత్సరాల పాటు విద్యారంగానికి ఎనలేని సేవలు చేశారని కొనియాడారు. అనంతరం పదవీ విరమణ చేసిన హెచ్‌ఎం శివరాజును ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కాంప్లెక్స్ హెచ్‌ఎం నర్సింహులు, వెంకటయ్య, ఉపాధ్యాయులు తిరుపతి, తిమ్మన్న, నరేందర్, దీప, విశాలక్షి తదితరులు పాల్గొన్నారు.



శివరాజును సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

వైభవంగా ముగిసిన కలశాభిషేకం



ప్రత్యేక అలంకరణలో అమ్మవారు



హోమం నిర్వహిస్తున్న దృశ్యం

నారాయణపేట రూరల్: పట్టణంలోని బాపూనగర్‌లో కొలువైన శ్రీ చౌడేశ్వరీదేవి ఆలయంలో గురువారం ఘనంగా కలశాభిషేకం నిర్వహించారు. 41రోజులుగా ఆలయంలో నిత్యహోమ కార్యక్రమం చేపట్టగా మండలం రోజులు పూర్తికావడంతో ముగింపు కార్యక్రమం వైభవంగా నిర్వహించారు. అమ్మవారికి పంచామృతాభిషేకం, కుంకుమార్చన, మహామంగళహారతి నిర్వహించి భక్తులకు అన్నదానం చేశారు. అంతకుముందు దేవాలయ శిఖరానికి కళశాభిషేకం నిర్వహించారు. కార్యక్రమంలో అర్చకులు కృష్ణ, ఆలయ కమిటీ సభ్యులు రామకృష్ణ, నారాయణ, వెంకట్‌స్వామి, బాలగోపాల్, సతీష్, రమేష్, సంతోష్, గోవిందరాములు, బాలరాజు, మురళీమోహన్, నరేందర్, రఘు, శ్రీను, నిఖిల్ పాల్గొన్నారు.

కొలతల ప్రకారం కూలి చెల్లిస్తాం

ఊట్కూరు: ఉపాధిహామీలో పనిచేసే కూలీలకు కొలతల ప్రకారం కూలీ డబ్బులు చెల్లిస్తామని పీఏ మహాలక్ష్మి అన్నారు. గురువారం మండలంలోని నిడుగుర్తి గ్రామంలో ఉపాధిపనులను పరిశీలించారు. అనంతరం కూలీలతో మాట్లాడుతూ.. కేంద్రప్రభుత్వం ఉపాధిహామీ కూలీలకు కనీస వేతనం 300రూపాయలుగా నిర్ణయించారని తెలిపారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో కూలీలకు కనీస వేతనం రూ. 270 అమలు చేస్తుండగా దీనికి అదనంగా రూ.28 జోడించి ఏప్రిల్ నెల నుంచి రూ. 300లకు పెంచుతుందని తెలిపారు. ఎండలు అధికంగా ఉండడంతో ఉపాధి కూలీలు ఉదయం 7గంటలకు వచ్చి 12 గంటల వరకు పనిముగించుకోవాలని ఆమె తెలిపారు. చెరువులో ఒండ్రుమట్టిని కూలీల చేత రైతుపొలాలకు తరలిస్తున్నారని కొలతల ప్రకారం రైతు ఖాతాలో డబ్బులు జమచేస్తామని ఆమె తెలిపారు. కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్ నర్సింహ తదితరులు పాల్గొన్నారు.



నిడుగుర్తిలో కూలీలతో మాట్లాడుతున్న పీఏ మహాలక్ష్మి

మూఢనమ్మకాలపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న షిటీం పోలీసులు

మరికల్: సమాజంలో మహిళలను వేధించిన ఆకాతాయిలపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని షిటీం ఏఎస్‌ఐ శ్రీదేవి అన్నారు. మండలంలోని జెడ్పీహెచ్‌ఎస్ పాఠశాలలో గురువారం విద్యార్థులకు పలు సామాజిక అంశాలు, బాల్యవివాహాలు, బాలకార్మికుల వ్యవస్థ, మూఢనమ్మకాలపై అవగాహన కల్పించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. పాఠశాల, కళాశాలలో కాని విద్యార్థినులకు వేధింపులకు గురిచేసిన కఠిన చర్యలు ఉంటాయన్నారు. మహిళలు షిటీం పోలీసులను సంప్రదించాలని సూచించారు. హెల్ప్‌లైన్‌కోసం నంబర్ 8712670398, 100కి కాల్ చేసి పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు.

కార్యదర్శులకు నీటిపరీక్ష కిట్ల అందజేత



నీటిపరీక్ష కిట్లను అందజేస్తున్న ఎంపీడీఓ పావని



మద్దూర్‌లో కిట్లను అందజేస్తున్న ఎంపీడీఓ జయరాములు

మరికల్: ఆర్‌డబ్ల్యూఎస్ శాఖ ఆధ్వర్యంలో పంచాయతీ కార్యదర్శులకు గురువారం ఎంపీడీఓ పావని నీటిపరీక్ష కిట్లను అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గ్రామాల్లో ప్రజలకు తాగునీరు అందిస్తున్న కుళాయిల ద్వారా వచ్చే నీటి ఈ కిట్లతో పరీక్షించాలన్నారు. తాగునీటిలో ఫ్లోరైడ్ వంటి సమస్యలు ఉంటే వాటిని పరిష్కరించేందుకు తక్షణమే చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రతి గ్రామంలో మూడు నెలలకోసారి నీటిపరీక్షలు చేయాలని కార్యదర్శులకు తెలిపారు. కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ఉదయ్, గ్రామ కార్యదర్శులు పాల్గొన్నారు.

మద్దూరు: మండలంలోని పంచాయతీ కార్యదర్శులకు బుధవారం ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీడీఓ జయరాములు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ చెన్నయ్య వాటర్ టెస్టింగ్ కిట్లను అందజేశారు. గ్రామాల్లో మిషన్‌భగీరథ ద్వారా వచ్చేనీటి నాణ్యతతోపాటు, గ్రామాల్లో బోరుమోటార్ల ద్వారా వచ్చే నీటి నాణ్యత పరీక్షించడానికి వీటిని ఉపయోగించాలని తెలిపారు. నీటి నాణ్యతను బట్టి గ్రామాల ప్రజలకు అవగాహన కల్పించాలని పంచాయతీ కార్యదర్శులకు ఆదేశించారు.

నేటినుంచి శ్రీలింగేశ్వరస్వామి ఉత్సవాలు ప్రారంభం

- పక్షం రోజులపాటు ఉత్సవాలు
- జోరుగా కొనసాగనున్న ఎద్దుల సంత
- శనివారం రథోత్సవం

ఊట్కూర్ : శ్రీ లింగేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు నేటినుంచి ప్రారంభం కానున్నాయి. మండలంలోని సమస్తాపూర్ వాగు, కర్ణాటక యాద్గీర్ జిల్లా ఇడ్లూర్ వాగులు సంఘమ క్షేత్రంలో స్వామివారి బ్రహ్మోత్సవాలు నేటినుంచి ఉగాది అమావాస్య వరకు పక్షం రోజులపాటు కొనసాగుతాయి. 29న శుక్రవారం తెల్లవారు జామున అగ్నిగుండం, సాయంత్రం ప్రభోత్సవం, 30న శనివారం రథోత్సవం నిర్వహిస్తారు. ఆలయంలో భారీనంది విగ్రహం, వీరభద్రేశ్వరుడు, నవగ్రహాలు తదితర దేవతామూర్తుల విగ్రహాలతోపాటు ఆలయ చరిత్రను తెలిపే శాసనాలు ఉన్నాయి. ఉత్సవాల్లో ఎద్దుల క్రయ, విక్రయాలు జోరుగా కొనసాగుతాయి. రథోత్సవంలో వేలాదిమంది భక్తులు పాల్గొని మొక్కులు తీర్చుకుంటారు. జాతరలో చిరు వ్యాపారులు మిఠాయిలు, ఆటవస్తువులు, గాజుల దుఖాణాలు, రంగులరాట్నం ఏర్పాటు చేస్తారు. కర్ణాటక, తెలంగాణ, మహారాష్ట్ర ప్రాంతాల నుంచి భక్తులు పాల్గొని మొక్కులు తీర్చుకుంటారు. గత దశాబ్ద కాలంగా ఆలయంలో నిత్యన్నదానం కొనసాగుతుంది. కర్ణాటక సైదాపూర్, ఊట్కూర్ పోలీసులు బందోబస్తు నిర్వహిస్తారు.



లింగేశ్వర స్వామివారి ఆలయం



స్వామివారి మూల విరాట్

ఆలయ ప్రత్యేకత..

ఇరు రాష్ట్రాల మధ్య ఉన్న శ్రీ లింగేశ్వరస్వామి దేవాలయాన్ని జన మేజయుడు అనే రాజు నిర్మించినట్లు శాసనాలు ఉన్నాయి. సూర్యోదయం కాగానే సూర్యకిరణాలు నేరుగా స్వామివారి మూలవిరాట్‌పై పడేవిధంగా ఆలయంలో శిల్పాలు నిర్మించారు. ఆలయంలో నల్లని రాతి శిల్పలాతో మండపాన్ని ఏర్పాటుచేశారు. మండపం స్తంభాలు, తోరణాలపై దేవతామూర్తుల విగ్రహాలను చెక్కారు. స్వామివారికి ఎడమ వైపున నంది విగ్రహం, కుడి వేపున వీరభద్రస్వామి విగ్రహాలను ఏర్పాటు చేశారు. ఏడాదిపాటు నంది విగ్రహం నాసిక రంధ్రాల ద్వారా జలధార వస్తుంది. దేవాలయం ఆవరణలో నవగ్రహాలను ఏర్పాటుచేశారు. ప్రతి అమావాస్యరోజు వేలాదిమంది భక్తులు దర్శించుకుంటారు.

రావి వేపచెట్టు ప్రత్యేకత..

దేవాలయ సమీపంలోని కలిసిన రావివేపచేట్టు చుట్టు ప్రదక్షణలు చేసేందుకు భక్తులు అధిక ప్రాధాన్యతన్నిస్తారు. సంతానం లేని దంపతులు వేపరావి చేట్టు ప్రదిక్షణలు చేస్తే వచ్చే ఉత్సవాల నాటికి సంతానం కలుగుతుందని భక్తుల నమ్మకం. ఆలయ సమీపంలో దశాబ్దాల కాలంనాటి పెద్దరావి, వేప చుట్టు ఉండేది. గాలికి పడిపోవడంతో వాటిస్థానంలో వెలిసిన రావివేపచేట్టు చుట్టు భక్తులు ప్రదక్షణలు చేస్తారు.

శనివారం రథోత్సవం


30 శనివారం సాయంత్రం రథోత్సవం ఘనంగా నిర్వహిస్తారు. సుమారు 40అడుగుల రథానికి రంగురంగుల పూలతో అలంకరించి, ఉత్సవ విగ్రహాన్ని ప్రతిష్టించి రథోత్సవాన్ని నిర్వహిస్తారు. రథోత్సవానికి తెలంగాణ, ఆంధ్ర, కర్ణాటక, మహారాష్ట్ర ప్రాంతాల నుంచి వేలాదిమంది భక్తులు పాల్గొని మొక్కులు తీర్చుకుంటారు.



స్వామివారి రథం

జోరుగా ఎద్దుల సంత..

లింగేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలలో పక్షంరోజులపాటు ఎద్దుల సంతజోరుగా కొనసాగుతుంది. కర్ణాటక, మహారాష్ట్ర, తెలంగాణ, ఆంధ్ర తదితర ప్రాంతాల నుంచి వ్యాపారస్తులు ఎద్దులను జాతరలో విక్రయించేందుకు తీసుకొస్తారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన రైతులు ఎద్దులను జాతరలో కొనుగోలుచేస్తారు. జాతరలో ఎద్దులను కొనుగోలు చేస్తే పంట దిగుబడులు అధికంగా వస్తాయని రైతుల నమ్మకం.



జాతరలో ఎద్దుల సంతా (ఫైల్)